ఇంటింటికీ గులాబీ దళం

ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న తెల్లం వెంకట్రావు

ఇండస్ట్రియల్ ఏరియా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం, నవంబర్ 8: గులాబీ దళం ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నది. భద్రాచలం నియోజకవర్గవ్యాప్తంగా ప్రచార జోరు పెంచింది. ఎమ్మెల్సీ, పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. దీనిలో భాగంగా బుధవారం వారు పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాతో పాటు వ్యాపార సముదాయాల పరిధిలో ప్రచారం చేపట్టారు.

పెన్షనర్ల అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

బీఆర్ఎస్‌కు ఇండస్ట్రియల్ ఏరియా ప్రముఖుల మద్దతు..

పట్టణంలోని ఇండస్ట్రీయల్ ఏరియాలో వ్యాపారి నారాయణ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో వ్యాపారులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావుకు మద్దతు తెలిపారు. అనంతరం తెల్లం పట్టణ ప్రముఖులు డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ శ్రీధర్ వర్మను మర్యాద పూర్వకంగా కలిసి బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం వ్యాపారి రేపాక రాంబాబును మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు కోరారు. తర్వాత ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఎన్నికల్లో గెలిపిస్తే పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెల్లం హామీ ఇచ్చారు.

ఘనంగా రాములోరి నిత్య కల్యాణం

రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, నవంబర్ 8 : భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో బుధవారం సీతారాములకు నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

కొనసాగుతున్న ఆభరణాల లెక్కింపు

భద్రాచలం, నవంబర్ 8 : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో వెండి ఆభరణాల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతున్నది. గతంలో ఉన్న వెండి ఆభరణాలతోపాటు ఇటీవల స్వామివారికి భక్తులు సమర్పించిన వెండి ఆభరణాలను కొలతలు, తూకం వేసి లెక్కిస్తున్నారు. రెండునెలల క్రితం బంగారు ఆభరణాలను మదింపు చేసిన దేవస్థానం అధికారులు వాటిని భద్రపరిచారు. ప్రస్తుతం భక్తులు స్వామివారికి కొత్తగా సమర్పించిన బంగారు, వెండి, ఇతర ఆభరణాలను ఆలయ అధికారులు లెక్కిస్తున్నారు. రామయ్యకు 65 కిలోల బంగారం, 978 కిలోల వెండి ఆభరణాలు ఉన్నాయి. లెక్కింపు అనంతరం ఆభరణాలను భద్రపరచనున్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో కేంద్ర వైద్యబృందం పర్యటన

పాల్వంచ రూరల్, నవంబర్ 8 : ఉల్వనూరు ప్రాథమిక వైద్యకేంద్రం పరిధిలోని గొత్తికోయలు నివసించే మారుమూల ప్రాంతాలైన బూసురాయి, రాళ్ళచెలక గ్రామాలను కేంద్ర వైద్యబృందం అధికారులు బుధవారం సందర్శించారు. రవాణా సౌకర్యం సరిగా లేకపోవడంతో పది కిలోమీటర్ల దూరం ట్రాక్టర్‌లో ప్రయాణం చేశారు. అడవి మధ్య ఆ ట్రాక్టర్ మట్టిలో కూరుకుపోవడంతో కాలినడకన మూడు కిలోమీటర్లు నడిచారు. బూసురాయి, రాళ్ళచెలక గ్రామాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటుచేసి, రోగులను పరీక్షించి సమస్యలున్నవారికి మందులు అందించారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. పారిశుధ్యం ప్రాధాన్యత గురించి ప్రత్యేక అవగాహన కల్పించారు. మలేరియా మాస్ స్క్రీనింగ్ టెస్టులను నిర్వహించారు. కార్యక్రమంలో ఢిల్లీ వైద్య బృంద అధికారులు పాండీ, మనీశ్, నవీన్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ స్పందన, ఇతర వైద్య అధికారులు గొంది వెంకటేశ్వర్లు, బాలాజీనాయక్, రేవంత్, తేజస్విని, సిబ్బంది జీతూ, హరికృష్ణ, శేషారత్నం, రమేశ్, చైతన్యకుమార్, శంకర్‌రెడ్డి, రామిరెడ్డి, సుగుణావతి, సుధ, విశ్వనాథం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బూసురాయి గ్రామానికి కాలినడకన వెళ్తున్న కేంద్ర వైద్యబృందం

మహిళలకు ఉచితంగా క్యాన్సర్ పరీక్ష

క్యాన్సర్ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహాలక్ష్మి

భద్రాచలం, నవంబర్ 8 : భద్రాచలం పట్టణంలోని రూపా స్కూల్‌లో రోటరీక్లబ్ అధ్యక్షురాలు మహాలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ పరీక్షా కేంద్రాన్ని మహాలక్ష్మి ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణప్రాంత మహిళల కోసం కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారు 200మంది మహిళలకు హైదరాబాద్ నుంచి వచ్చిన వైద్యుల బృందం అన్ని టెస్ట్‌తో కూడిన ప్రత్యేక బస్‌లో పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. క్యాంప్‌లో రోటరీ డాక్టర్లు సోమయ్య, ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ రామకృష్ణ, పూర్వ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి, పీసీ కేశవ్, రఫీ, మధు, వీరయ్య, నాగేశ్వరరావు, రాజారెడ్డి, రాజశేఖర్, ఎస్కే అజీమ్, ప్రసన్న, వాసు, బాలాజీ, పలివెల రవికుమార్, శ్రీనివాస్, నరసింహారావు, చలపతి, శేఖర్, శంకరరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

వెంకటాపురం (నూగూరు), నవంబర్ 8: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావుకు ఓటు వేసి గెలిపించాలని 1969 ఉద్యమకారుడు, తిప్పన సిద్దులు పిలుపునిచ్చారు. ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తేనే ఏజెన్సీలో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, నాయకులు గుడవర్తి నర్సింహమూర్తి, చిడెం రవికుమార్, మురళి, లక్ష్మీనారాయణ, చిడెం వెంకట్రావు పాల్గొన్నారు.8డీజీఎం02 : కన్నాపురంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మాట్లాడుతున్న ఉద్యమకారుడు తిప్పన సిద్దులు

కన్నాపురంలో బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

దుమ్ముగూడెం, నవంబర్ 8 : మండల పరిధిలోని కన్నాపురం, నడికుడి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు గెలుపు కోసం ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. మ్యానిఫెస్టో అంశాలను వివరించి కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. తెల్లంను గెలిపిస్తే నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరుగుతుందని, ఏజెన్సీ ప్రాంతంలో ఇప్పటికే బీఆర్ఎస్ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కణితి రాముడు, ఎంపీటీసీ సోడె తిరుపతిరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భద్రాచలంలో మూడు నామినేషన్లు

భద్రాచలం, నవంబర్ 8 : భద్రాచలంలో బీజేపీ పార్టీకి చెందిన అభ్యర్థి కుంజా ధర్మారావు, ఆయన కుమారుడు కుంజా సంతోష్, సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్య నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో, భద్రాచలం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మంగీలాల్‌కు బీజేపీ తరపున పోటీచేస్తున్న కుంజా ధర్మారావు ఒక సెట్ నామినేషన్ సమర్పించగా, మరోసెట్ ధర్మారావు కుమారుడు కుంజా సంతోశ్ సమర్పించారు. అనంతరం సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్య నామినేషన్ సమర్పించారు. నామినేషన్ వేసేందుకు శుక్రవారం వరకు సమయముంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పొదెం వీరయ్య నేడు నామినేషన్ వేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు మరో సెట్ నామినేషన్ శుక్రవారం సమర్పించనున్నట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు.

జేవీఆర్వోసీ సీహెచ్‌పీలో అన్నదానం

అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎండీ రజాక్

రామవరం, నవంబర్ 8: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సింగరేణి కొత్తగూడెం ఏరియా సత్తుపల్లి జేవీఆర్వోసీ విజయదుర్గ ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పిట్ సెక్రటరీ కేవీ రావు, నాయకులు నగేష్, యశ్వంత్‌రెడ్డి, నాగేందర్‌రావు, రమేశ్, శ్రీను, వరప్రసాద్, ఆర్.వెంకటేశ్వరరావు, జగన్నాథరావు, లక్ష్మణ్‌రావు, క్రాంతి, యూసుబ్, మురళి, భారత్, పోషం, శ్రీను, శేఖర్, రమణ పాల్గొన్నారు.

25 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

బియ్యం వాహనాన్ని స్వాధీనం చేసుకున్న డీటీ శ్రీరామ్ రాథోడ్

దమ్మపేట, నవంబర్ 8 : అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని దుమ్ముగూడెం సివిల్ సప్లై డీటీ శ్రీరామ్ రాథోడ్ బుధవారం పట్టుకున్నారు. భద్రాచలం నుంచి ఏపీలోని చట్టి ప్రాంతానికి టాటాఏస్ వాహనంలో బియ్యాన్ని తరలిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు సివిల్ సప్లై డీటీ శ్రీరామ్ రాథోడ్ వాహనాన్ని వెంబడించి కొత్తపల్లి సమీపంలో పట్టుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా రూ.లక్ష విలువైన 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ మహేంద్ర, దారా బాబూరావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు డీటీ తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని జీసీసీ కేంద్రానికి తరలించినట్లు పేర్కొన్నారు.